ప్రజాశక్తి
శనివారం 1 జులై 2023

7న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జూలై 7 ఉదయం 10-30 గంటలకు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జెడ్‌పి సమావేశ మందిరంలో జరుగుతుందని సిఇఒ కె. రాజ్ కుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ సభ్యులు, రెండు జిల్లాల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని పలు శాఖలు చేపడుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చ జరుగుతుందని తెలిపారు.

విద్యుత్తు భారాలపై పెల్లుబికిన నిరసన

● పెంచినఛార్జీలను ఉప సంహరించాలి ●వామపక్షాల ఆధ్వర్యాన విద్యుత్ కార్యాలయాల వద్ద ఆందోళనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించాలని, స్మార్టు మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యాన శుక్రవారం జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద, జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ వద్ద నిరసనలు చేపట్టారు. దాసన్నపేట విద్యుత్ భవనం వద్ద ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం ఎల్ న్యూ డెమోక్రసి నాయకులు బెహరా శంకరరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం అన్యాయమన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి నేడు భారాలు వేస్తున్నారని అన్నారు. రైతులకు ఉచిత కరెంట్ ఇస్తామని చెప్పి నేడు స్మార్టు మీటర్లు పెట్టి లూటీ చేయాలని చూస్తున్నారని అన్నారు. తక్షణమే ప్రజలపై వేసిన రూ.25కోట్ల విద్యుత్ భారాలను వెనక్కి తీసుకోవాలని,స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని, రైతులకు, ఎస్సీ,ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, ఎ. జగన్మోహన్, బి.రమణ, కంది త్రినాథ్, సిపిఐ నాయకులు రంగరాజు, రమణమ్మ, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రెడ్డి నారాయణరావు, అప్పలరాజు, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరంలో విద్యుత్‌భవన్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

బొబ్బిలి : వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సబ్ డివిజనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఇఫ్టూ జిల్లా నాయకులు ఎం.గోపాలం, రైతు కూలి సంఘం నాయకులు వి.కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంపుతో ఫెర్రో పరిశ్రమలు మూత పడుతున్నాయన్నారు. విద్యుత్ రాయితీ ఎత్తి వేసేందుకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నా రన్నారు. కార్యక్రమంలో వామపక్ష కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గజపతినగరం: విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు వి.లక్ష్మి, జి.శ్రీనివాసరావు, సిపిఎం మెంటాడ మండలం కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అనంతరం ఎఇ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.రామునాయుడు, కె.రాము, టి.కృష్ణ, హెచ్.పైడిరాజు, ఎం.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండల కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన చేపట్టారు. సిఐటియు నాయకులు బలస శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహకార్యదర్శి అలమండ ఆనందరావు, అప్పల నాయుడు, సోములు, భవాని పాల్గొన్నారు.

నెల్లిమర్ల: విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వామ పక్షాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గంగా విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్య ప్రజానీకంపై పెను భారం వేశాయన్నారు.అనంతరం ఎఇకి వినతి అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం,సిపిఐ, న్యూడెమోక్రసీ నాయకులు కిల్లంపల్లి రామారావు, తాలాడ సన్ని బాబు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పల సూరి, పిఒడబ్ల్యు నాయకులు ఎస్.వెంకట లక్ష్మీ, ఎల్. వరలక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు కనకల పద్మనాభం పాల్గొన్నారు.

వేపాడ : విద్యుత్ భారాలకు నిరసనగా జాకేరు సబ్‌స్టేషన్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లాజగన్ మాట్లాడుతూ ఉచిత విద్యుత్తు ఇచ్చే పంపుసెట్లకు మీటర్ల బిగించాలని నిర్ణయించడం రైతులను దగా చేయడమేనని అన్నారు. కేంద్రం చేతుల్లో ఉండే రెగ్యులేటరీ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలు శ్రీను , ధారబాబు ,యనమల రవణ, అప్పలనాయుడు పాల్గొన్నారు

శంగవరపుకోట : పట్టణంలోని దేవి జంక్షన్ కూడలి నుంచి విద్యుత్ కార్యాలయం వరకు సిపిఐ, టిడిపి, జనసేన ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.రామేశ్వరరావు, జనసేన నాయకులు వి.సన్యాసినాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జివిఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు నానిగిరి రమణాజి, నాయకులు చెక్కా కిరణ్ కుమార్, కాపుగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు టివి రమణ మాట్లాడారు. విద్యుత్తుఛార్జీల భారాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో ఎ.గౌరినాయుడు, అప్పలనాయుడు, సన్యాసినాయుడు, కరణం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

గజపతినగరం : నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

నేటి నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే నాణ్యమైన పరిష్కారం చూపేందుకు క్షేత్ర స్థాయిలో నిర్వహించనున్న జగనన్న సురక్ష శిబిరాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వాటికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి రోజు విడిచి రోజు నెల రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా కార్యక్రమ షెడ్యూల్‌ను ప్రకటించారు. జగనన్న సురక్ష సర్వేలో భాగంగా 50 సచివాలయాల పరిధిలో అధికార బృందాలు ఇంటింటికీ వెళ్లాయని, 41,584 టోకెన్లు నమోదయ్యాయని వివరించారు. వాటిలో 73 శాతం పరిష్కారానికి నోచుకున్నాయని, మిగిలిన వాటికి శిబిరాల్లో పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి శిబిరం రోజు వాటికి సరైన పరిష్కారం చూపుతూ సంబంధిత ధ్రువ పత్రాలు మంజూరు చేయాలని సూచించారు. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని 11 రకాల సేవలను మిషన్ మోడ్‌లో ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. సురక్ష సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి తెలుసుకున్న ప్రజా సమస్యలకు ఈ శిబిరాల వద్ద వాటి పరిష్కారానికి సంబంధించిన సర్టిఫికేట్లను అందజేయాలని సూచించారు.

ప్రతి మండలం నుంచి రెండు బృందాలు

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలం నుంచి రెండు బృందాలు ఆయా సచివాలయాల పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఒక్కో మండలంలో రెండు సచివాలయాల పరిధిలో ఎంపిడిఒ అధ్యక్షతన ఒక బృందం, తహశీల్దార్ అధ్యక్షతన మరొక బృందం ఈ శిబిరాలు నిర్వహిస్తాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను డిఎల్‌డిఒ నిర్మలా దేవి పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు.జగనన్న సురక్ష పేరుతో నిర్వహించే శిబిరాల వద్ద ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించేందుకు నాలుగు ప్రత్యేక డెస్కులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వాటిలో రిజిస్ట్రేషన్ డెస్కు, వెరిఫికేషన్ డెస్కు, సర్వీస్ రిక్వెస్టు డెస్కు, జగనన్నకు చెబుదాం డెస్కు ఉంటాయని ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష' ధ్రువపత్రాలు పంపిణీ

కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం ద్వారా మంజూరైన ధ్రువపత్రాలను శనివారం ఉదయం లబ్ధిదారులకు అందజేయనున్నట్లు కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు తెలిపారు. జగనన్న సురక్ష పథకం అమలులో భాగంగాయ 1,2సచివాలయాలకు సంబంధించి పూల్ బాగ్ లోని రెండవ నెంబర్ సచివాలయంలోనూ, 3,4 సచివాలయాలకు సంబంధించి 3వ నెంబరు సచివాలయంలో నూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం ఆయా సచివాలయాలకు నగరపాలక సంస్థ అధికారులు మరియు నోడల్ అధికారులు వెళ్లి కార్యక్రమాల నిర్వహణా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ పై సలహాలు, సూచనలను కిందిస్థాయి సిబ్బందికి కమిషనర్ ఇచ్చారు. అర్హత ఉండి ధ్రువీకరణ పత్రాలను పొందలేని వారికి జగనన్న సురక్ష పథకం వరం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

సమావేశంలో మాట్లాడుతున్న నూతన ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు

ఆచరణాత్మక విధానంతో విద్యా బోధన

- **సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డిఎన్‌రావు**
- **ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు బాధ్యతల స్వీకరణ**

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పాత సంప్రదాయ విధానంలో గాకుండా ఆచరణాత్మక విధానంలో బోధన ఉంటుందని ఆ విశ్వవిద్యాలయ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డిఎన్ రావు స్పష్టం చేశారు. యూనివర్శిటీ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, వైస్ ఛాన్సలర్ గా డాక్టర్ పి.కె.మహంతి, రిజిస్ట్రార్ గా డాక్టర్ పల్లవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎన్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాలను నేర్పేవిధంగా ఇక్కడ బోధన ఉంటుందన్నారు. ఇక్కడ విద్యార్థులకు అవసరమైన అన్ని ప్రయోగశాలలు ఉన్నాయన్నారు.ఇలాంటి విశ్వవిద్యాలయాన్ని ఇతర రాష్ట్రాలలో ఏర్పాటు చేయమని ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఇక్కడ వ్యవసాయ నిలువు గోపురాలు తయారు చేసేందుకు ఆస్ట్రేలియా నుంచి ఒక కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. ఇక్కడ తయారు చేసిన వాటిని ఆస్ట్రేలియా, ఆఫ్రికా తదితర దేశాలకు ఎగుమతి చేయనున్నామని వివరించారు. బాధ్యతలు చేపట్టిన కొత్త కార్యవర్గం దాదాపు ఆరేళ్లపాటు ఆయా పదవులలో కొనసాగుతారని తెలిపారు. నూతన ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల బోధన పద్ధతులు, అధునాతన ప్రయోగశాలలు, క్రీడా పరికరాలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది నాక్ గుర్తింపునకు వెళ్లనుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.కె.మహంతి, రిజిస్ట్రార్ గా డాక్టర్ పల్లవి,ప్రస్తుత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, ప్రొఫెసర్లు ఎంఎల్ఎన్ ఆచార్యులు, కెవిజి కృష్ణమూర్తి, డీన్ సన్నీడియోల్ , డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ పలువురు అధ్యాపక , బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

లీడర్లు హుషారు.. కార్యకర్తలు బేజారు

ఎస్.కోట నియోజకవర్గ టిడిపిలో గందరగోళం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసేందుకు అధినేతలు నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ వారిలో తలలో నాలుకల ఉండేలా జాగ్రత్తలు పడుతున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బస్సు యాత్ర పేరుతో ప్రజలతో మమేకమవుతున్నారు. యువగళం పాదయాత్రతో లోకేష్ అధికార పార్టీ నేతల తప్పులను ఎత్తిచూపుతూ కేడర్‌ను ఉత్సాహపరుస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో శృంగవరపు కోట నియోజకవర్గంలో టిడిపి నాయకుల వ్యవహారం వలన కార్యకర్తలు బేజారవుతున్నారు. తాజాగా టిడిపి యువ నాయకుడు గొంప కృష్ణను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ గురువారం రాత్రి పార్టీ నుంచి ప్రకటన వెలువడింది. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారికి ఎమ్మెల్యే అభ్యర్థిగా టిక్కెట్‌కు లైన్ క్లియర్ అయ్యిందంటూ ఓ ఛానల్‌లో ప్రసారం కావడంతో ఆమె గ్రూపు నాయకులంతా దేవిబొమ్మ కూడలిలో బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. శారు. దీంతో గొంపకృష్ణ గ్రూపు నాయకులు స్పందిస్తూ 'కంగారు పడకండి త్వరలో రాబోయే ప్రకటన వరకు వేచి చూడండి' అంటూ వాట్సాప్‌గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టారు. ఈ నేపథ్యంలో మరో ఛానల్ లో రాష్ట్ర కార్యదర్శి పదవితో పాటు త్వరలో కృష్ణకు నియోజకవర్గ ఇన్చార్జి పదవినీ కట్టబెట్టబోతు మన్నారంటూ వార్తలు రావడంతో నియోజకవర్గ టిడిపి కార్యకర్తల్లో గందర గోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటికే లలితకుమారి, గొంపకృష్ణ ఇద్దరూ పార్టీలోని పెద్ద నాయకులను కలుస్తూ, రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిన కార్యక్రమాలను పోటాపోటీగా చేస్తున్నారు. ప్రజలతో మమేకమైతు నియోజకవర్గ టిడిపిలో జోష్ నింపుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రకరకాల ప్రకటనలతో కార్యకర్తలను తప్పుతోవ పట్టించవద్దు అంటూ సీనియర్ నాయకులు అంటున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబు ఎవరిని ప్రకటిస్తారో వేచి చూడాలని, అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం నాయకులంతా ఏకతాటిపై నడుస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు.

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా గొంప కృష్ణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట, వేపాడ

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా ఆ పార్టీ నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చంనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.కోట నియోజవర్గం నుండి రాష్ట్ర కార్యవర్గంలో గొంప కృష్ణని నియమిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారనే నమ్మకంతో తనను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారని గొంప కృష్ణ అన్నారు. తమపై పెట్టిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నిరంతరం పార్టీ శ్రేయస్సుకి పాటు పడతానన్నారు. అందరిని కలుపుకుంటూ, పార్టీ నాయకుల సూచనలు, సలహాలు మేరకు ముందుకు వెళ్లనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎస్‌కోటలో శనివారం అభినందన సభ నిర్వహించనున్నట్లు టిడిపి నాయకులు గొంప ఉమేష్ కుమార్ తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెడ్‌పిచైర్మన్ శ్రీనివాసరావు

యువతకు అన్ని విధాలా ప్రోత్సాహం

యువ ఉత్సవంలో జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వివిధ రంగాల్లో విద్యార్థుల నైపుణ్యాల ప్రదర్శనతో నగరంలోని ఎంఆర్ ఎడ్యుకేషన్ కళాశాలలో శుక్రవారం యువ ఉత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్ లో పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేశారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అనే అంశంపై వక్తృత్వం, చిత్రలేఖనం, పద్యరచన, ఫోటోగ్రఫీ, సంప్రదాయ, జానపదనత్యం తదితర ఐదు అంశాల్లో పోటీలు నిర్వహించారు. వక్తత్వం, సంప్రదాయ నత్యం అంశాల్లో మొదటి బహుమతి కింద రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.2,500, మూడో బహుమతిగా రూ.1250 అందజేశారు. ఫోటోగ్రఫీ, చిత్రలేఖనం, పద్యరచన పోటీల్లో విజేతలకు రూ.1000, రూ.750, రూ.500 వంతున బహుమతులు అందజేశారు. ఉదయం నుంచి ఈ అంశాల్లో పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీసేందుకు యువజన ఉత్సవాలు, పోటీలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో జరుగుతున్న అగ్నివీర్ ఎంపికకు హాజరయ్యే యువతకు శిక్షణ ఇచ్చి సన్నద్ధం చేసేందుకు జెడ్పీ నిధులు అందజేస్తున్నామని చెప్పారు. జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్, ఎంఆర్‌కళాశాల ప్రిన్సిపాల్ బిఎస్ఎన్‌రాజు, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, డిఐపిఆర్ఒ డి.రమేష్, ఎన్‌వైకె ఎఒ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు, జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ పథకాల లబ్ధే లక్ష్యం

వైసిపి నాయకులు విఎస్ ప్రసాద్, మామిడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరికీ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ విఎస్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే కోలగట్ల నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న కార్యక్రమాలకు కొనసాగింపుగా రాష్ట్రంలో మిగిలిన 1 శాతం మంది ప్రజల్లో కూడా ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే, వారికి పథకాలు అందించడంతోపాటు, అవసరమైన సర్టిఫికెట్లను మంజూరు చేయాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వాలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శిస్తారని, ఇంటి యజమానితో మాట్లాడి.. ప్రభుత్వ సేవలకు సంబంధించి వారి సమస్యలను తెలుసుకుంటారని వివరించారు. సమస్యలేవైనా ఉన్నా, సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల అర్హతను గుర్తించి ఆ వివరాలను నమోదు చేసుకుంటారని వెల్లడించారు. జులై 1 నుంచి 30 రోజుల పాటు జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు. 11 ధ్రువపత్రాలకు సంబంధించి దరఖాస్తు చేసుకొని పొందవచ్చునని తెలిపారవు. ఈ అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, పార్టీ నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, కెల్ల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ వైద్యం అంతంతమాత్రమే

- **జనాభాకు తగ్గట్టుగా లేని పిహెచ్‌సిలు, సబ్ సెంటర్లు**
- **వైద్యులపై తీవ్ర పనిభారం రోగులకూ తీరని వెతలు**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో వైద్యసేవలను మరింత దగ్గరకు చేరుస్తున్నామన్న ప్రభుత్వ మాటలు ఆచరణలో అర్ధసత్యంగానే మిగులుతున్నాయి. ఇంటింటికీ వైద్యసేవలు అందుతాయని చెప్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా వైద్యుల సంఖ్యను పెంచలేదు. కేవలం కొంతమేర సిబ్బందిని పెంచి విప్లవాత్మకమైన మార్పులుగా చెప్పకోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు వైద్యులపై పనిభారం పెరుగుతోంది. మందులు, వైద్య పరీక్షలు కూడా ప్రభుత్వం చెబుతున్నంతగా అందడం లేవు.

వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్‌ల పేరిట ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం విధితమే. మేప్రిల్ 6వ తేదీ నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది. గ్రామాల్లోకి వైద్యులు వెళ్లి ఇంటింటికీ తిరిగి వైద్యసేవలు అందించడం మంచిదే. చాలా మంది ఈ విధానాన్ని స్వాగతించారు. కానీ, అందుకు తగ్గట్టు వైద్యుల సంఖ్యను పెంచలేదు. ఈ పథకం ద్వారా పిహెచ్‌సిలోగల ఇద్దరు వైద్యులు చెరో కొన్ని విలేజ్ క్లీనిక్‌లకు బాధ్యత వహించాల్సి వుంటుంది. వైద్యులు రోజుకొకరు చొప్పున తమకు కేటాయించిన క్లీనిక్‌లో ఒకపూట, ఆ క్లీనిక్ పరిధిలోగల ఇంటినుంచి బయటకు రాలేని రోగుల ఆరోగ్య తనిఖీలు రెండోపూట నిర్వహించాలి. పిహెచ్‌సికి కేటాయించిన 104వాహనంలోనే ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో కలిసి చేరుకుంటారు. ఈ వాహనంలోనే మందులు, సుగర్, బిపి, హెచ్‌ఐవి, థైరాయిడ్ వంటి 17రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయి. వీరికి క్లీనిక్‌లో నియమించిన బిఎస్సీ నర్సింగ్ సిబ్బంది, సంబంధిత సచివాలయ ఎఎన్ఎం, స్థానిక ఆశా వర్కర్ సాయపడతారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అధునాతన 104 అంబులెన్స్‌లు 1088 ఏర్పాటు చేశారు. సుమారు 46వేల మంది బిఎస్‌సి నర్సింగ్ స్టాఫ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లను నియమించినట్టు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడుదల రజని ప్రకటించారు. జిల్లాలోనూ అవసరమైనన్ని పోస్టులు భర్తీచేశామని వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ, ఆచరణలో చాలా చోట్ల ఈ సేవలు కేవలం విలేజ్ క్లీనిక్‌లకే పరిమితమయ్యాయి. పిహెచ్‌సిలు, సచివాలయ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ఫ్యామిలీ వైద్యం బాగానే అమలవుతున్నా మధుర గ్రామాల్లో సరిగా అందడం లేదు. ఈ సంగతి కాస్త అటుంచితే విలేజ్ క్లీనిక్‌లు పెట్టినప్పటికీ ప్రభుత్వమేమీ అదనపు వైద్యులను నియమించలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం మైదాన ప్రాంతంలో ప్రతి 25వేల జనాభాకు, గిరిజన ప్రాంతంలో ప్రతి 10వేల జనాభాకు ఒక పిహెచ్‌సి చొప్పున ఉండాలి. మైదాన ప్రాంతంలో ప్రతి 5వేల జనాభాకు, గిరిన ప్రాంతంలో 2వేల జనాభాకు ఒకొక్కటి చొప్పున సబ్-సెంటర్లు ఉండాలి. విజయనగరం జిల్లాలో 2011 లెక్కల ప్రకారం సుమారు 20లక్షల జనాభా ఉంది. ఇందులో మైదాన ప్రాంతంలో 19.50లక్షలు, గిరిజన ప్రాంతంలో 50వేల జనాభా ఉంది. ఈ లెక్కన ఒక్క మైదాన ప్రాంతంలో 78 పిహెచ్‌సిలు, 390 సబ్-సెంటర్లు, గిరిజన ప్రాంతంలో 5పిహెచ్‌లు, 25 సబ్ -సెంటర్లు ఉండాల్సినప్పటికీ మైదాన, గిరిజన ప్రాంతం కలుపుకుని మొత్తంగా 48పిహెచ్‌సిలు, 452 సబ్ సెంటర్లు మాత్రమే ఉన్నాయి. సబ్-సెంటర్ల సంఖ్య కాస్త సరిపోయినప్పటికీ కీలక వైద్యసేవలందే పిహెచ్‌సిలు సగానికి సగం మాత్రమే ఉన్నాయి. దీన్ని బట్టి మైదాన ప్రాంతంలో ప్రతి 50వేల మందికి ఒక డాక్టర్ మాత్రమే ఉన్నారు. బాడంగి మండలంలో మొత్తం 25పంచాయతీల పరిధిలో 32గ్రామాలు ఉన్నాయి. వీటన్నిటికీ ఒకే ఒక్క వాడాడ పిహెచ్ ఆధారం. దీంతో, వైద్య బృందాలు కేవలం విలేజ్ క్లీనిక్ కేంద్రాలుగావున్న 18 గ్రామాల్లో మాత్రమే సేవలందిస్తున్నాయి. ఈ మండలంలోని పూడివలస, పిండ్రింగివలస, చినవాడాడ, మల్లంపేట, అచ్చియ్యపేట, లక్ష్మీపురం, హరిజన పాల్తేరు గ్రామాలకు చెందిన రోగులు సంబంధిత విలేజ్ క్లీనిక్‌కి వెళ్లాలంటే కనీసం మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సి వుంటుంది. ఈనేపథ్యంలో ఇటువంటి చోట్ల ఇంటింటికీ వైద్య సేవల పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయడం వైద్యులకు సవాలుగా మారింది. కేవలం బాడంగి మండలంలోనే కాదు. దాదాపు ఎక్కువ చోట్లు ఇటువంటి పరిస్థితి ఉంది. దీంతో, క్షేత్ర స్థాయిలో కీలక సేవలందించడం బహుభారంగా మారుతోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు క్లీనిక్ భవనాలు కూడా పూర్తి కాకపోవడంతో పరాయి పంచల్లోనూ, ఆ అవకాశమూ లేని చోట ఆరు బయట మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మందులు, వైద్యపరీక్షలకు అవసరమైన పరికరాలు సమకూర్చడంతో పాటు అందుకను గుణంగా వైద్యులు, ఇతర సిబ్బందిని సన్నద్ధం చేయాల్సి వుంది.

గజపతినగరం మండలంలో సేవలు అందిస్తున్న వైద్యులు

'జగనన్న సురక్ష' పై అవగాహన

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని మరుపల్లి సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసిఎస్ కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం వాలంటీర్లు, గృహసారదులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిలో ఉన్న సమస్యలను గుర్తించి జగనన్న సురక్ష యాప్‌లో అప్లోడ్ చేయాలని వారికి సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్‌లను వెంటనే సచివాలయంలో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కోస్ మెంబర్ రెడ్డి పద్మావతి, గుడివాడ కన్వీనర్ రామునాయుడు, లెంక రమణ, దనాన రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కడలికి ఎన్‌టిఆర్ గోల్డెన్ బ్రష్ అవార్డు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చిత్ర కారుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులు కడలి ప్రకాశరావు ఎన్‌టిఆర్ గోల్డెన్ బ్రష్ అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్‌టిఆర్ జయంతోత్సవాల సందర్భంగా కోనసీమ జిల్లా కాత్రేని కోనలో అకొండి అంజి క్రియేటివ్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్‌టిఆర్ జయంతోత్సవ చిత్ర లేఖన పోటీల్లో పాల్గొన్న జరజాపుపేటకు చెందిన కడలి ప్రకాశ రావు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 9న విజయవాడలో ప్రకాశరావు అవార్డు అందుకుంటారు.

ఆలయానికి వితరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో లైఫ్ టైం విద్యుత్ బిల్లు చెల్లించడానికి కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ దంపతులు విరాళం అందజేశారు. శుక్రవారం 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ మహేశ్వరి దంపతులు వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం విద్యుత్ బిల్లు జీవిత కాలం చెల్లించడానికి ఆలయ అభివృద్ధి ట్రస్ట్ సభ్యులు కొండపల్లి అప్పారావు, కర్రి రామాచారి మాస్టారు, కొండపల్లి రమణ, ఎం ప్రసాద్, పెదగాడ రాజారావు, గానుగుల అప్పలాచారి ఏ బాబుకి విరాళం అంద జేశారు.

హాస్టల్ భవనం మరమ్మతులను చేపట్టాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ఆర్ఐకు వినతి పత్రమిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్థానిక బిసి బాలుర వసతి గృహం మర మ్మత్తులు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ సోమేష్ శుక్రవారం ఆర్ఐకు వినతిపత్రం అందజేశారు. భవనం నిర్మించి చాలా కాలం కావడంతో మరమ్మతులు గురైందని వర్షాకాలంలో పెచ్చులూడి కారిపోతుందని చెప్పారు. దీని వల్ల విద్యార్థులు భయభ్రాంతులు చెందుతున్నారని విద్యార్థులు వరండాలోని నిద్రపోతున్నారని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. స్పందించకపోతే తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని బొండపల్లి, గెద్దపేట సమీపంలో గల చెరువు వద్ద పని చేస్తున్న ఉపాధి హామీ వేతనదారులకు శుక్రవారం టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కరణం శివ రామకృష్ణ మజ్జిగతో పాటు శీతల పానీయాలను పంపిణీ చేశారు. ఈ మేరకు ఉపాధి హామీ వేతన దారుల సమస్యలు, పని ప్రదేశంలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎండ వేడిమి దృష్ట్యా నీడను కల్పించే టెంట్‌లు లేకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో వేతన దారులకు పని ముట్లు ఇచ్చిన విషయాన్నీ ఆయన గుర్తుచేశారు. టిడిపి మహానాడులో ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలపై ఆయన వేతనదారులకు వివరించారు. ప్రస్తుత పరిస్థితిలలో మన రాష్ట్రాన్ని చంద్ర బాబునాయుడే కాపాడగలరని, ఆయనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈయన వెంట స్థానిక గ్రామ పార్టీ అద్యక్షుడు పైల శ్రీనువాస రావు, లెంక చిన్నం నాయుడు, సత్తిబాబు, సత్యనారాయణ గౌరినాయుడు తదితరులు ఉన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లక్కవరపుకోట పిహెచ్‌సి వైద్య సిబ్బంది మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ పివి మురళీకృష్ణ మాట్లాడుతూ మలేరియా వ్యాధి వ్యతిరేక మహోత్సవాలు ముగింపు వేడుకలలో భాగంగా ర్యాలీ నిర్వహించామన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో కాళీ కొబ్బరి బొండాలు, సీసాలు, పాత టైరులు వంటివి లేకుండా చూడాలన్నారు. తద్వారా దోమలు గుడ్లు పెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాకాలమంతా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరును తాగాలని సూచించారు. ఆరోగ్య విషయంలో ఎటువంటి సమస్య వచ్చినా తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండో వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్, ఎంపిహెచ్ఇఒ శ్యామలారావు, జి శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపితోనే సంక్షేమం సాధ్యం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

వైసిపితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. శుక్రవారం కాసిందొర వలస గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన సీసీ డ్రైనేజీలు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మీ, వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపిపి అరసాడ శంకర్రావు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, సర్పంచులు కరణం దాలమ్మ, జాగరపు శ్రీనివాసరావు, ఎంపిటిసి గొర్లి తిరుపతిరావు, జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, నాయకులు కడుపుకుటి సూర్యారావు, ఉత్తరావల్లి అప్పలనాయుడు, ప్రభుత్వ అధికారులు, పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు, విద్యార్థులు

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - కొత్తవలస

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి యువత ముందుకు రావాలని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జ్ డాక్టర్ సముద్రాల విజయ్ చంద్ర అన్నారు. శుక్రవారం 'పిల్లల చదువు జాతి భవితకు వెలుగు' అనే నినాదంతో స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జంక్షన్‌లో గల హోటల్లు, కిరాణా షాపుల్లో యజమానులకు బాల కార్మికులు గూర్చి వివరించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే వారి భవిష్యత్తును మనమే నాశనం చేసిన వారమవుతామన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి అందరూ ముందుకు రావాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కళ్ళెంపూడి మహేశ్వరరావు, సెక్రటరీ గిరిబాబు, పాల్గొన్నారు.

రూ.83లక్షలతో అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సరోజిని

నగర పంచాయతిలో రూ.83.25లక్షలతో అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం చేశారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతి కార్యాలయంలో చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయితిలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, కాలువలు, పుష్ కార్ట్స్, డంపింగ్ యార్డుకు విద్యుత్ సౌకర్యం, రక్షణ గోడ తదితర అభివృద్ధి పనులు జరప దానికి కౌన్సిల్ తీర్మానం చేశారు. నగర పంచాయతి పేరును నెల్లిమర్ల - జరజాపుపేట నగర పంచాయతిగా పేరు మార్చడానికి కౌన్సిల్ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపి ఆగ్రహం

ప్రజాశక్తి- రేగిడి

తహశీల్దార్‌ను సర్వే గురించి అడుగుతున్న ఎంపి బెల్లాన

మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాకపోవడం, సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం కరువవడంతో ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిటిసిలు, సర్పంచులు గ్రామస్థాయి సమస్యలపై చర్చకు రావడం, అధికారులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో అన్ని తానై ఎంపి ఓపికతో సభ్యులకు సమాధానం చెప్పారు. గైర్హాజరైన అధికారులపై చర్యలకు తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని వైస్ ఎంపిపి టంకాల అచ్చెన్నాయుడుకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ధార అప్పల నరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారుల పనితీరును ఎంపి అడిగి తెలుసుకుని, సమస్యలు ఉన్న గ్రామాలపై తక్షణ పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యా శాఖ చర్చలో భాగంగా ఎంఇఒ వరప్రసాదరావు మాట్లాడుతూ 1,2 విడతల్లో నాడు నేడు పనులు చేపడుతున్నామని, 18 పాఠశాలకు బిల్లులు పెండింగులో ఉన్నాయని అన్నారు. మూడవ విడతలో ప్రతిపాదన పంపించినట్లు సభకు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖపై జెఇ శ్రీచరణ్ మాట్లాడుతూ జలజీవన్ పథకంలో మూడు విడతలగా 39 పంచాయతీల్లో ఇంటింటికి కుళాయి ఏర్పాటుకు రూ.37 కోట్లు మంజూరయ్యాయని, పనులు ఇప్పటికే ప్రారంభించి కొన్ని గ్రామాల్లో పూర్తి చేసామని చెప్పారు. ఉంగరాడ, కోడిశ, మునకలవలస, కందిస గ్రామాలకు అవసరం మేరకు బోర్లు వేయాలని సూచించారు. చెలికానివలస, ఆర్ ఆముదాలవలస గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైర్లు సరి చేయాలని సర్పంచులు సభ దృష్టికి తీసుకురావడంతో వెంటనే సరిచేయాలని ఎఇకి ఎంపి ఆదేశించారు. గహ నిర్మాణ శాఖ ఎఇ రంగనాథం మాట్లాడుతూ మండలంలో 2,173 గృహాలు మంజూరయ్యాయని, వీటిలో 1,221 గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. కొన్ని గ్రామాలకు బిల్లులు చెల్లించాలని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. రేగిడి, బూరాడ వైద్యాధికారులు సాహిని, రీనా చౌదరి మాట్లాడుతుండగా ఎంపి కలుగజేసుకొని 104 వాహనం గ్రామాలకు వెళ్లేటప్పుడు గ్రామాల్లో టామ్‌టామ్ వేయించాలన్నారు. ఎపిఒ హరినాథ్ మాట్లాడుతూ 16,520 మంది జాబు కార్డులకు పనులు కల్పిస్తున్నామన్నారు. తహశీల్దార్ టి. కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంలో ఏడు రకాల సర్వీసులు ప్రజలకు అందిస్తున్నామన్నారు. భూ రీ సర్వే ఏడు గ్రామాల్లో పూర్తయ్యాయని, పారంపేట, పనసలవలస, మునకలవలస ఉణుకూరు గ్రామాల్లో ప్రారంభించామన్నారు. మండల జెఇ రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో 25 సచివాలయాలకు 17 సచివాలయాలు నిర్మాణంలో ఉన్నాయని, ప్రస్తుతం ఆరు చోట్ల పూర్తయినట్లు తెలిపారు.సమావేశంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంతు, ఇంఛార్జి ఎంపిడిఒ నాగమణి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


పొలంలోకి వృధాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

ప్రజాశక్తి -గుర్ల

మండలంలో పల్లిగండ్రేడులో తాగునీటి వెల్ నుండి ఓవర్ హెడ్ ట్యాంక్‌కు వెళ్లే తాగునీరు పైప్‌లైన్ లీక్ అవ్వడంతో తాగునీరు వృథా అవుతోంది. ఓవర్ హెడ్ ట్యాంక్‌కు పూర్తిస్థాయిలో నీరందక పోవడంతో తాగునీరు కోసం మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలో గల బోరు బావి నుండి వచ్చే నీరు పంట పొలంలో లీక్ కావడంతో సమస్య నెలకొంది. తాగునీరు కోసం గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో కూడా అదే ప్రదేశంలో పైప్‌లైన్ లీక్ అవ్వడం, మరమ్మత్తులు చెయ్యడం జరిగింది. మరమ్మత్తులు సరిగ్గా చేయకపోవడంతో ఎప్పటికప్పుడు ఇలా జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీని పూర్తి స్థాయిలో అరికట్టి తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

లారీలను అడ్డుకున్న రైతులు

వేపాడ : మండలంలోని వావిలపాడు రెవెన్యూ పరిధిలో ఆరు క్రషర్లు నడుపుతున్నారు. ఈ క్రషర్ల నుంచి రోజుకు 200 లారీలు అధిక లోడుతో రవాణా సాగిస్తున్నాయి. దీంతో రోడ్డంతా పాడవడంతో పాటు దుమ్ము ధూళి మామిడి పంటలపై పడి పంటల పాడైపోతున్నాయి. ఎన్నిసార్లు క్వారీ యజమానులకు మొరపెట్టుకున్న కనీసం రోడ్డును వాటర్‌తో కూడా తడపడం లేదు. దీంతో రైతులు శుక్రవారం లారీలకు అడ్డంగా ట్రాక్టర్ పెట్టి అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బూడి గౌరి నాయుడు, వెంకటరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రహీం షేక్‌లాల్ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు బక్రీద్ పండగ సందర్భంగా వారికి అవసరమయ్యే ఉపకారణాలను ఆయన పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై కౌన్సిలర్ల ఏకరువు

ప్రజాశక్తి- బొబ్బిలి

సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్లు

మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై కౌన్సిల్ సభ్యులు ఏకరువు పెట్టారు. కౌన్సిల్ హాల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రజా సమస్యలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ప్రేమనగర్ కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని బుడా పెట్రోల్ బంకుకు అప్పగించేందుకు తీర్మానం చేసేందుకు కౌన్సిల్లో పెట్టగా కౌన్సిలర్ తెంటు పార్వతమ్మ వ్యతిరేకించారు. ప్రేమనగర్ పేదలకు ఇచ్చిన స్థలాన్ని బుడా పెట్రోల్ బంకుకు కేటాయించడం అన్యాయమని మండిపడ్డారు. అభిప్రాయ సేకరణ చేసిన తర్వాత స్థలం కేటాయిస్తే మంచిదని కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు అన్నారు. స్థలం కేటాయింపు తీర్మానాన్ని వాయిదా వేయాలని కోరారు. దీనిపై ఉప తహశీల్దార్ బి.గౌరీశంకర్ స్పందిస్తూ పట్టాలిచ్చిన ఆరు నెలల్లో నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దు చేసే హక్కు రెవెన్యూ అధికారులకు ఉందని, నిర్మాణాలు లేకపోవడంతో రద్దు చేసి బుడాకు కేటాయించామని చెప్పారు. పట్టణ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయడంలో విఫలం చెందుతున్నామని, సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ కోరారు. తాగునీటి సరఫరా చేయని ప్రాంతాలకు మంచినీటి ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేయాలని, శంకుస్థాపన చేసిన పనులు పూర్తి చేయాలని, పాత పైపులైన్లను మార్చాలని టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు కోరారు. ఐదో వార్డులో రోడ్లు, పైపులైన్ వేయాలని, కాలువలలో పూడికలు తొలగించేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను పెట్టాలని కౌన్సిలర్ హైమవతి కోరారు. చాకలి వీధిలో కుళాయి ద్వారా సక్రమంగా నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగా కుళాయిలు ఏర్పాటు చేయాలని మూడో వార్డు కౌన్సిలర్ బి.సురేష్ కోరారు. టిటిడి కల్యాణ మండపం ప్రహరీ పక్కన షాపులను బలవంతంగా తొలగించడం అన్యాయమని, మిగిలిన అన్ని షాపులను తొలగిస్తామని చెప్పిన అధికారులు ఎక్కడ తొలగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై టిపిఒ వరప్రసాద్ స్పందిస్తూ ఐటిఐ కాలనీ వద్ద ఉన్న షాపులను తొలగించామని, అన్ని షాపులను తొలగిస్తామని చెప్పారు. షాపులను బలవంతంగా తొలగించలేదని మున్సిపల్ చైర్మన్ సావు మురళి అన్నారు. పట్టణంలో మంచినీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, పచ్చదనం పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర, మున్సిపల్ నిధులు రూ.10.37కోట్లు ఖర్చు చేసేందుకు తీర్మానం చేశారు.

గ్రీన్ అంబాసిడర్ల బిక్షాటన

ప్రజాశక్తి- గజపతినగరం

ర్యాలీ చేస్తూ బిక్షాటన చేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్లకు గత12 నెలలుగా జీతాలు లేక శుక్రవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యంలో గజపతినగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి మెంటాడ రోడ్డు వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తూ బిక్షటన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు 12 నెలలుగా జీతాలు బకాయి ఉంచడం వల్ల వాళ్ల కుటుంబాలు పస్తులతో జీవిస్తున్నారన్నారు. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రికి కనబడటం లేదా అని విమర్శించారు. పేద దళితులైన గ్రీన్ అంబాసిడర్లు ఇన్ని నెలలుగా పస్తులు ఉండటంతో పాటు అటు పిల్లలు విద్య, వైద్యంకి ఖర్చు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో ఇన్ని నెలలుగా బకాయి జీతాలతో ఎవరైనా పని చేస్తున్నారా అని ప్రశ్నించారు? వెంటనే ముఖ్యమంత్రి, కలెక్టర్ స్పందించి బకాయి జీతాలు చెల్లించాలని, ప్రభుత్వం ప్రకటించిన పదివేల రూపాయలు వెంటనే ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పని భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో ఏ ఇబ్బంది లేకుండా వెంటనే వీళ్ళ సమస్యలు పరిష్కారం చేయాలని లేదంటే జిల్లా అంతా గ్రీన్ అంబాసిడర్లను ఐక్యం చేసి సమ్మెకు సిద్ధం చేస్తామని దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వం జిల్లా అధికారి యంత్రాంగమే వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, గ్రీన్ అంబాసిడర్ నాయకులు నూకరాజు, రాము, గౌరీ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- గంట్యాడ

గిరిజన ప్రాంత ప్రజలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వం ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శుక్రవారం డీకేపత్రిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పథకాలను అందే తీరును కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లోని విద్యను అభివృద్ధి చేయడానికి మెడికల్ కాలేజీను, ఇంజనీరింగ్ కాలేజీలను నిర్మించారన్నారు. పేద విద్యార్థులు చదువులు అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో అమ్మఒడి పథకం పెట్టారన్నారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని డిఇతో మాట్లాడి పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాపపాలెం, ముసలకండి, రేగులపాలెం గ్రామాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్‌ను వేయడానికి నిధులను మంజూరు చేస్తానన్నారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని ఎఇ ప్రసన్నకుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణ కుమార్‌కు సూచించారు. అడ్డతీగ నుండి ఇతర గ్రామాలకు కంకర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి శోభ హైమావతి, జెడ్‌పిటిసి వర్రీ నరసింహమూర్తి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోగాపురం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాజపులోవ, మహారాజుపేట గ్రామాలలో వైసిపి మండల కన్వీనర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికి పర్యటించి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరుగుతుంటే ప్రతిపక్షాలు ఓర్వ లేకపోతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు నిరాటంకంగా అందాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలన్నారు కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దార్ బంగారు రాజు, సర్పంచ్ కిలారి స్వప్న, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, వైస్ ఎంపిపి రావాడ బాబు, వైసిపి నాయకులు కర్రోతు శ్రీనివాసరావు, పిడుగు రాంబాబు, కిలారి వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ

వైకెపి ఆధ్వర్యంలో మహారాజుపేట వద్ద ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు చేతులమీదుగా మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించని సమావేశమెందుకు?

ప్రజాశక్తి - వేపాడ

సమస్యను వివరిస్తున్న గ్రామస్తుడు

మండలంలోని వీలుపర్తి రెవెన్యూ పరిధిలో దుంగాడ గ్రామ సర్వే నంబరు7లో సుమారు 18 ఎకరాల్లో క్వారీ ఏర్పాటుకు శుక్రవారం ఆ గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సమావేశంలో రైతులు కొప్పల సూరిబాబు, వార్డు మెంబరు మాట్లాడుతూ నేటికీ ఆరేడు సార్లు క్వారీలు ఏర్పాటు చేసారు కానీ రైతుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. పొల్యూషన్ అరికట్టడం, రిగ్ బ్లాస్టింగ్‌లు ఆపడం, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం వంటివి చేయలేదన్నారు. పాడైపోయిన రోడ్డును బాగు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. క్వారీల వల్ల పంటలకు నివాస గృహాలకు అనుక్షణం ఇబ్బం దులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు ఇప్పటికైనా తమకు ఇబ్బంది లేకుండా క్వారీలు నడుపుకోవడానికి అభ్యంతరం లేదని గిరిజన రైతులు వాపోయారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు, కాలుష్య నివారణ అధికారి సరిత, కాలుష్య నివారణ ఇంజనీర్ విజయకుమార్, గ్రామ పెద్దలు సేనాపతి అప్పారావు, భూషణం పాల్గొన్నారు.

గ్రంథాలయం ఎప్పుడు నిర్మిస్తారు..?

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలిలో గ్రంథాలయం ఎప్పుడు కడతారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు ప్రశ్నించారు. చదువులకు నిలయంగా ఉన్న బొబ్బిలిలో శాశ్వత గ్రంథాలయం కూడా పూర్తి చెయ్యాలేని పరిస్థితులో ఈ ప్రభుత్వం ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడు తూ ఇప్పటిలోగా ఎలాగూ శాశ్వత భవనం నిర్మించలేరని, కనీసం తాత్కాలిక భవనంలో టాయిలెట్ సదుపాయమైనా కల్పించాలని కోరారు. పాడైపోయిన బోరింగు పునరుద్ధరణ, చిల్లులు పడ్డ భవనం పైకప్పులను తీసి కొత్తవి వేసి, కనీసం పుస్తకాల స్టోరేజీకి కొన్ని బీరువాలు, కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అయ్యే విద్యార్థుల కోసం అవసరమైన పుస్తకాలు అందుబాటులోకి తక్షణమే తీసుకురావాలని కోరారు. వారం రోజుల్లో ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోతే జనసేన పార్టీ తరపున తామే చందాలు వేసుకుని గ్రంథాలయం మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన బొబ్బిలి, తెర్లాం, బలిజిపేట మండల అధ్యక్షులు సంచాన గంగాధర్ మరడాన రవి, బొంకురు పోలి నాయుడు, నాయకులు పళ్లెం రాజా, పైలా సాయిరాం, గేదెల శివ, రామభద్రపురం మండల నాయకులు చీమల సతీష్, రమేష్, సీతానగరం మండల నాయకులు శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకులు

నేరాలు ఘోరాలు

చెక్ బౌన్స్ కేసులో ముద్దాయికి జైలుశిక్ష

శృంగవరపుకోట: చెక్ బౌన్స్ కేసులో ముద్దాయికి 6 నెలల కారాగార శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక జ్యుడీషియల్ ఫస్టక్లాస్ మెజిస్ట్రేట్ కుమారి సబ్బవరపు వాణి శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఎస్‌కోటకు చెందిన సిహెచ్ సుధాకర పట్నాయక్ తన వ్యాపార నిమిత్తం అదే గ్రామానికి చెందిన గడబ వెంకట మల్లేశ్వర ప్రసాద్ వద్ద 2016 ఫిబ్రవరి 10న రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లింపు నిమిత్తం 2017 సెప్టెంబరు 30న రూ.4లక్షల చెక్కును ఇవ్వగా చెక్కు చెల్లుబాటు కాలేదు. వెంటనే గడబ వెంకట మల్లేశ్వర ప్రసాద్ కోర్టులో చెక్ బౌన్స్ కేసును వేశారు. ఇరు పక్షాల వాదోపవాదనలను విన్న పిదప న్యాయమూర్తి వాణి ముద్దాయికి 6 నెలలు కారాగార శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధించారు. ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో ఒక సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్షను విధిస్తూ తీర్పును ఇచ్చారు. ముద్దాయి ఫిర్యాదుదారుడికి రూ.4 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కూడా తీర్పులో పేర్కొన్నారు.

వేధింపు కేసులో 8 ఏళ్ల జైలు

జామి: మండలంలోని సిరికిపాలెం గ్రామానికి చెందిన కుంచంగి రఘు అనే వ్యక్తికి 8 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఎస్. కోట న్యాయ స్థానం తీర్పు వెల్లడించింది. మండలంలో కొంత కాలంగా నకిలీ విలేకరిగా, చెలామణి అవుతున్న రఘు, 2016లో ఓ మహిళను అసభ్య మెసేజ్‌లతో ఇబ్బందులు పెట్టాడు. అనేక మార్ఫింగ్ ఫోటోలను ఆమెకు పంపిస్తూ ఆమెను వేధించేవాడు. రఘు బాధలను భరించలేని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. అప్పట్లో ఎస్ఐ ఘని కేసు నమోదు చేసి నిందుతుడిని న్యాయ స్థానం ముందు ఉంచారు. న్యాయ స్థానం విచారణ అనంతరం ఎస్.కోట మెజిస్ట్రేట్ వాణి నేరం రుజువైన నేపథ్యంలో ముద్దాయికి 8 ఏళ్ల జైలు శిక్ష, రూ. 40వేలు జరిమానా విధించారు.

కోడి పందాలు ఆడుతున్న 8మంది అరెస్టు

నెల్లిమర్ల: కోడి పందాల పై దాడి చేసి 8మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. మండలంలోని ఎ.టి. అగ్రహారం గ్రామ శివార్లలో కోడి పందాలు ఆడుతున్న వారిపై గురువారం సాయంత్రం పోలీసులతో దాడి చేసి, కోడి పందాలు ఆడుతున్న 8మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి ఒక కోడిపుంజు, రూ.22,610ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పశువులపై పిచ్చికుక్కల దాడి

గుర్ల: మండలంలోని పల్లిగండ్రేడులో గురువారం అర్ధ రాత్రి పిచ్చి కుక్కలు పశువులపై దాడి చేశాయి. ఈ దాడిలో 15 పశువులు కుక్క కాటుకు గురయ్యాయి. అందులో 6 ఆవులు, 6 దూడలు, 2 మేకలు, ఎద్దు, కుక్క దాడికి గురయ్యాయి. ఈ సమాచారాన్ని తెట్టంగి పశువైద్యాధికారికి, సచివాలయం హెచ్ఎకి గ్రామస్తులు తెలియజేశారు. వెంటనే పశువైద్యాధికారి డాక్టర్ సతీష్, నలుగురు పశువైద్య సహాయకుల గ్రామానికి చేరుకుని గాయపడిన పశువులన్నింటికి శుక్రవవారం చికిత్స చేశారు. టిటి ఇంజెక్షన్లు, ర్యాబిస్ నివారణ టీకాలు వేశారు. పిచ్చి కుక్కల దాడికి గురి కాకుండా గ్రామంలో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ సతీష్ ప్రజలకు సూచించారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - గజపతినగరం

17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక శుక్రవారం గజపతినగరం పాత ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ కే.కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, అంబుడ్స్ మెన్ అన్న పూర్ణ దేవి, ఎపిడి శారదా దేవి, డివిఒ రవీంద్ర, క్లస్టర్ ఎపిడి జనార్దన్‌రావు ముఖ్య అథిదులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 30 గ్రామ పంచాయతీలో 2022-2023 సంవత్సరాలకు గాను ఉపాధి, ఎస్ఎస్ఎ పనులు సుమారు రూ.18 కోట్లతో జరిగాయన్నారు. ఈ పనులకు సంబంధించి 15 రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. ఆ తనిఖీలలో చెరువు పనుల్లో కొలతల్లో స్వల్ప తేడాలను గుర్తించారన్నారు. వాటిని సరిచేయమని ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించామన్నారు మస్తర్లు సరిగా లేని క్షేత్ర సహాయకులకు జరిమానా వేస్తున్నామన్నారు. ఇకపై ఎటువంటి అవకతవకలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎపిఒ సి.హెచ్.రామారావు, ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులు పెంపొందించేందుకు కృషి

రేగిడి: పాడి రైతుల జీవనోపాదులు పెంపొందించేందుకు తమ వంతు కృషి చేస్తానని హెరిటేజ్ రీజినల్ హెడ్ పి. నాగప్పారావు అన్నారు. అంబకండి గ్రామంలో పాలకొండ హెరిటేజ్ ప్లాంట్ ధ్వర్యంలో పాడి రైతులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు ఉచిత ప్రమాదం భీమా, పాడి పశువులకు భీమా, పాల ఉత్పత్తి చేసే రైతుల ప్రయోజనం కోసం హెరిటేజ్ సంస్థ నిరంతర విధేయతగా పని చేస్తోందన్నారు. పాడి రైతులు అభివృద్ధి కోసం పాలకి సరైన ధరలు అందిస్తున్నామని, 6 నెలకొకసారి ప్రోత్సాహకంలో భాగంగా బోనస్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం ఏరియా మేనేజర్ మోహన్ రెడ్డి, ప్లాంట్ మేనేజర్ ఎం. అప్పల నాయుడు, పాడిరైతులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలకు కార్యాచరణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని గొల్జాం ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్. కోటరావుపై చర్యలకు కార్యచరణ సిద్ధం చేశామని డ్వామా ఎపిడి ఎస్ శారదాదేవి తెలిపారు. 'ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం' అనే శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. ఈ సందర్భంగా శారదాదేవి ప్రజాశక్తితో మాట్లాడుతూ తన కుటుంబీకులు చెరువు పనులకు రాకుండా ఫీల్డ్ అసిస్టెంట్ మస్తరులు వేయడాన్ని డ్వామా పీడీ ఉమామహేశ్వరి దృష్టిలో ఉందన్నారు. అక్రమ మస్తరులకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ కోటరావుపై విచారణ చేపట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహారాజశ్రీ విజయనగరం జడ్జివారి కోర్టులో
GOP 17/2022
Between:
Jana Sandhya Rani ......Petitioner
And:
Nill ......Respondent
General Notice to Public
యిందు మూలముగా యావన్మందికి తెలియజేయునదేమగా పై కేసులో పిటిషనరును ఆమె మైనరు కుమార్తె పూజిత శ్రీజనా, దేవ హర్షవర్ధన్ జనకుమారులకు ఆమెను గార్డియనుగా నియమించమని పిటిషను షెడ్యూలు ఆస్తులు విక్రయించుటకు అనుమతి కోరుచూ దాఖలు చేయగా సదరు పిటిషను తే 12-7-2023దీకి వాయిదా వున్నది. పై పిటిషనులో ఎవరికైనా ఆక్షేపణలున్న ఎడల తే 12-7-2023దీన ఉదయం 10-30 గంIIలకు హాజరై పైకోర్టు వారికి మనవి చేసుకొనవలెను. లేనిచో సదరు పిటిషను మీ పరోక్షమందు తీర్మానించడమగును.
ఇట్లు
J. Bheemasena Rao
Advocate for Petitioner,
Vizianagaram,
Cell: 9441053628